సాక్షి
పల్నాడు
బుధవారం । 16 । జూలై । 2025



పోలేరమ్మకు సారె సమర్పణ

పాతనందాయపాలెం(కర్లపాలెం): స్థానిక గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి మహిళలు మంగళవారం ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు.



కనకదుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గ అమ్మవారికి మంగళవారం బోనాలు సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మోపిదేవి:మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

556.60 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్:నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 556.60 అడుగులకు చేరింది. ఇది 224.5548 టీఎంసీలకు సమానం . సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 64,789 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

'స్థానిక' పరిపాలనలో మహిళా భాగస్వామ్యం పెరగాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్ : స్థానిక సంస్థల పరిపాలనలో మహిళా భాగస్వామ్యం పెరగాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం "మహిళా నాయకత్వంలో మార్పు–స్థానిక స్వపరిపాలనలో సాధికారత" అనే అంశంపై మహిళా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్‌ఏ) వార్షిక ప్రణాళిక 2025–26లో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ మహిళా నాయకత్వంలో మార్పు ద్వారా స్థానిక పాలనలో స్వపరిపాలన సాధ్యపడుతుందని అన్నారు. గ్రామస్థాయిలో మహిళా ప్రజా ప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సూచించారు.

అమృత భారత్ పనుల పరిశీలన



నరసరావుపేట: గుంటూరు–హుబ్లీ మార్గంలోని నరసరావుపేట, వినుకొండ, దొనకొండ రైల్వే స్టేషన్లను మంగళవారం డీఆర్‌ఎం సుథేష్ట సేన్ తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో అమృత భారత్ కింద చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుంటూరు అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రమేష్‌కుమార్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎంఏ నోయల్, గుంటూరు సీనియర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, గుంటూరు సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఈద్గా స్థలం కోసం క్షేత్రస్థాయి పరిశీలన



యడ్లపాడు: ఈద్గా స్థలం కేటాయింపునకు సంబంధించి ముస్లిం ప్రతినిధులు చేసిన వినతిని పరిగణలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆర్డీవో మధులత కోట గ్రామాన్ని సందర్శించారు. మంగళవారం స్థానికంగా ఉన్న ప్రతిపాదిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈద్గా కోసం అభ్యర్థించిన స్థలం మొత్తం 51 సెంట్లు ఉంది. ఇది రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో, మూడు సర్వే నంబర్లలో విస్తరించి ఉందన్నారు. అందులో కొంత భాగం శ్మశానం, కాలువ, ఖాళీ భూమిగా ఉంది. స్థానికుల వినతిని దృష్టిలో ఉంచుకుని అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, సర్వేయర్ సురేంద్రనాథ్, ఆర్‌ఐ సుబ్బారావు, వీఆర్వో బాబురావు ఆమె వెంట ఉన్నారు.

బీసీ నేతలపై అక్రమ కేసులు

బీసీల సంక్షేమానికి ఎంతో చేశామంటూ ప్రగల్భాలు పలికే చంద్రబాబు ప్రభుత్వం ఓ బీసీ నేత రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకపోతోంది. ఆ నేతపై కక్ష కట్టింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఎనిమిది కేసులు నమోదు చేసింది. 200 రోజులు కటకటాలపాల్జేసింది. చివరకు అతనిని పదవీ నుంచి దించేసింది. పల్నాడు జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ బీసీ నేతలను అణగదొక్కుతుంది.

పల్నాడులో కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

- మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌పై కొనసాగుతున్న వేధింపులు
- 8 కేసులు నమోదు చేసి 200 రోజులు జైలులో ఉంచిన కూటమి ప్రభుత్వం
- పీడీ యాక్ట్ అమలు చేసి కౌన్సిల్ సమావేశానికి రానీయకుండా అడ్డుకున్న ప్రభుత్వం
- చైర్మన్ పదవి నుంచి తొలగింపు
- అడ్వయిజరీ కమిటీ పీడీ యాక్ట్ ఎత్తివేయడంతో పాత కేసులు నమోదు
- బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న కిషోర్ సోదరుడిపైనా అక్రమ కేసులు
- ఓర్వలేకనే కేసులు అంటున్న బీసీ సంఘాల నేతలు



తురకా కిషోర్‌ను మాచర్ల కోర్టుకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ నేతలను రెడ్‌బుక్ అమలు పేరిట అక్రమ కేసులతో వేధిస్తోంది. ముఖ్యంగా గత ప్రభుత్వంలో రాజకీయంగా ఎదిగిన బడుగుబలహీన వర్గాల నేతలే టార్గెట్‌గా ఈ వేధింపులు సాగుతున్నాయి. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన తురకా కిషోర్‌పై కూటమి ప్రభుత్వం కక్షకట్టింది. ఎనిమిది అక్రమ కేసులు బనాయించి సుమారు 200 రోజుల పాటు జైలు పాలు చేసింది. కనీసం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కూడా వెళ్లనీయకుండా జైలుకు పంపారు. జైలునుంచి బయటకు రాకుండా కేసుల మీద కేసులు పెట్టి మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు, లోకేష్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిలు కిషోర్‌ను టార్గెట్ చేశారు. ఎన్నికల పోలింగ్ తర్వాత కారంపూడిలో జరిగిన గొడవలో కిషోర్‌పై అక్రమ కేసు బనాయించారు. ఎన్నికల సమయంలో రెంటచింతల మండలం పాలువాయి గేటు ఘటనలో కూడా కిషోర్‌పై కేసు నమోదు చేశారు. కిషోర్ కుటుంబంతో సహా మాచర్ల నుంచి దూరంగా వెళ్లిపోయారు. అప్పటికీ టీడీపీ నేతలు ఆ కుటుంబాన్ని వదల్లేదు. మాచర్లలో ఉన్న కిషోర్ ఇంటిపై దాడులు చేసి ఇంట్లో సామాన్లను పగలగొట్టి వీరంగం సృష్టించారు. పోలీసులు కిషోర్ కోసం ఆరు స్పెషల్ టీంలను ఏర్పాటుచేసి అక్రమ కేసుల్లో అరెస్ట్ చేశారు. కుటుంబ సభ్యులను సైతం ఇబ్బందిపెట్టాలన్న ఉద్దేశంతో కిషోర్‌తో పాటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సోదరుడు శ్రీకాంత్, జర్నలిస్టుగా పనిచేస్తున్న మరో సోదరుడు పట్టాభిపైనా కేసులు నమోదు చేశారు. శ్రీకాంత్, కిషోర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

పీడీ యాక్టు పెట్టి పదవి నుంచి తొలగింపు

ఒక కేసులో కిషోర్‌కు బెయిల్ వస్తుందన్న నేపథ్యంలో వెంటనే పోలీసులు అలర్ట్ అయి మరో కేసు బనాయిస్తున్నారు. ఇలా కిషోర్‌తోపాటు రాజకీయాలతో ఏమాత్రం సంబంధంలేని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీకాంత్‌పైనా మూడు అక్రమ కేసులు బనాయించారు. అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తూ ఒక కేసులో బెయిల్ రావడం ఆలస్యం మరో కేసును బనాయించి జైలు నుంచి బయటకు రానివ్వకుండా పీటీ వారంట్లు వేస్తూ పథకం ప్రకారం ప్రభుత్వం ముందుకెళ్తుంది. ఎప్పుడో 2022లో నాగార్జునసాగర్‌లో ఒక ఘటన జరిగితే ఆ ఘటనలో కిషోర్ పాత్ర ఉందంటూ అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అంతటితో ఆగక మరింత కక్షతో చివరకు కిషోర్‌పై ప్రభుత్వం పీడీయాక్ట్ నమోదు చేసింది. దీంతో నెల్లూరు జైలులో రిమాండ్‌లో ఉన్న కిషోర్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించారు. పీడీయాక్ట్‌పై అడ్వయిజరీ కమిటీ పూర్తిస్థాయిలో విచారించింది. కిషోర్‌పై పీడీ యాక్ట్ పెట్టడం సరికాదని తేల్చిచెప్పింది. దీంతో పీడీ యాక్ట్ ఎత్తివేశారు. ఇదే నేపథ్యంలో ప్రభుత్వం మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవినుంచి కిషోర్‌ను తొలగిస్తూ జీఓ జారీ చేసింది.

రూ.10 వేలు దొంగతనం చేశాడంటూ తిరిగి జైలుకు...

ఓ బీసీ యువకుడిని పదవి నుంచి తొలగించేందుకు ఏకంగా చట్టవిరుద్ధంగా పీడీ యాక్టును సైతం అమలు చేసి కక్ష తీర్చుకున్నారు. అంతటితో ఆగని ప్రభుత్వం పీడీ యాక్ట్ ఎత్తి వేయగానే జైలు నుంచి బయటకు వచ్చే క్రమంలో మళ్లీ వెంటనే 2023లో ఓ స్థలాన్ని కిషోర్ కబ్జా చేయబోయాడంటూ మరో అక్రమ కేసు బనాయించారు. ఈ కేసుకు సంబంధించి పీటీ వారెంట్ దాఖలు చేసిన పోలీసులు జైలునుంచి విడుదలవడానికి సిద్ధంగా ఉన్న కిషోర్‌ను మాచర్ల కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో కోర్టు రిమాండ్ విధించి గుంటూరు జిల్లా జైలుకు పంపించింది. ఇలా కేసుల మీద కేసులు పెడుతూ బయటకు రానివ్వకుండా కిషోర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుంది. 2023 జరిగిన ఘటన కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేస్తుందేమో నన్న అక్కసుతో ఈనెల 13వ తేదీన వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో 2022 జరిగిన పాత సంఘటనపై మరో కేసు నమోదు చేయించారు. ఇందులో ఏకంగా అప్పటి మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ తనను పార్టీ మారమని బెదిరించి ఇంట్లోని బీరువాను పగలగొట్టి రూ.10 వేలు దొంగతనం చేశాడని వెల్దుర్తి మండలం లోయపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త దారపునేని శ్రీనివాసరావు చేత ఫిర్యాదు చేయించారు. ఇందులో మాచర్ల కోర్టు రిమాండ్ విధించింది. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన తురకా కిషోర్ రాజకీయంగా ఎదగడం ఓర్వలేక కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిలు కక్షకట్టి వేధిస్తున్నారని బీసీ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బీసీలపై అక్రమ కేసులు మానుకోవాలని హెచ్చరిస్తున్నారు.

బస్తాలపై ముద్రించిన ధరలకే కొనుగోలు చేయాలి

- 28.35 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల
- పట్టణం, మండలంలో అంతర్ జిల్లా కమిటీల అధికారులు తనిఖీలు



సత్తెనపల్లి: రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు ఎరువుల కట్టల(బస్తాలు)మీద ముద్రించిన ధరలకే కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు అంతర్ జిల్లా కమిటీలుగా ఏర్పాటైన అధికారులు ఏలూరు జిల్లా కోట రామచంద్రపురం సహాయ వ్యవసాయ సహాయకులు పీజీ బుజ్జిబాబు, విజయవాడ రీజినల్ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ ఉమర్, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డిలు మంగళవారం సత్తెనపల్లి మండలం, పట్టణ పరిధిలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా దుకాణాలలో స్టాక్ బుక్స్, బిల్లులు, ఇన్వాయిస్, భౌతిక నిల్వలు పరిశీలించారు. ఎరువులు రైతులకు అమ్మకాలు జరిపి స్టాక్ రిజిస్టరులో నమోదు చేయకపోవటం వల్లన భౌతిక నిల్వలలో వ్యత్యాసం గమనించినరూ.7,43,104 విలువ కలిగిన 28.35 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. పురుగు మందులు, విత్తనాలకు సంబంధించిన ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ పరిశీలించారు. స్టాక్ వివరాలను ప్రతిరోజూ బోర్డులో ప్రదర్శించాలని, ప్రభుత్వ అనుమతి ఉన్న పురుగు మందులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటపుడు అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

సృజనకు స్వాగతం

- నామినేషన్ల స్వీకరణ మొదలు
- సెప్టెంబర్ 15 వరకు గడువు
- 2022–23లో జిల్లా స్థాయిలో 126 ప్రాజెక్టులు

ఇన్‌స్పైర్ మనాక్‌కు వేళాయె



2022–23లో జాతీయ పోటీలకు జై భారత్ పబ్లిక్ స్కూల్ నుంచి ఎంపికైన ప్రాజెక్ట్

సత్తెనపల్లి: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలతో పాటు సృజనాత్మకత పెంపొందించి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 6 నుంచి 10వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులు. సమాజానికి ఉపయోగపడే సరికొత్త ప్రాజెక్టులతో సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఇన్‌స్పైర్‌లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా పాల్గొనవచ్చు. ప్రతి తరగతి నుంచి ఒకరు చొప్పున ప్రాథమిక ఉన్నత పాఠశాలకు మూడు, ఉన్నత పాఠశాలలకు ఐదు ప్రాజెక్టులు నమోదు చేసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 15లోగా నామినేషన్‌కు అవకాశం కల్పించారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా ...

ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులు పొందేందుకు ఆసక్తి ఉన్నవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఇన్‌స్పైర్ అవార్డ్స్‌డిస్ట్ డాట్ గొ డాట్ ఇన్ (www.inrpireawardrdrt.gov.in) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి. మొదట పాఠశాల అథారిటీ ఐకాన్ని క్లిక్ చేసి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేయాలి. పాఠశాల వివరాలన్నీ పొందుపర్చాలి. జిల్లా విద్యాశాఖ నుంచి ఆమోదం వచ్చిన తర్వాత ఈ మెయిల్, యూజ్ ఐడీతో లింక్ వస్తుంది. అందులో పాస్‌వర్డు ఏర్పాటు చేయాలి. తర్వాత నమూనా ప్రాజెక్టు పూర్తి వివరాలు పొందుపరచాలి.

ప్రోత్సాహకాలివి...

ఇన్‌స్పైర్ మనాక్ వెబ్‌సైట్‌లో నమోదు చేసిన ప్రాజెక్టుల్లో ఉత్తమ ఆలోచనల్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డులకు ఎంపిక చేస్తుంది. ఇలా జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొని జాతీయస్థాయిలో ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు అందజేస్తుంది. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్ చుట్టుపక్కల ప్రాంతాల సందర్శనతో పాటు జపాన్ పర్యటనకు అవకాశం కల్పిస్తారు.

అంతా సత్తా చాటేలా...

ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. 2022–23లో జిల్లా స్థాయిలో 126 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. వాటిలో 13 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా అందులో రెండు జాతీయ స్థాయి పోటీలకు (క్రోసూరు జై భారత్ పబ్లిక్‌స్కూల్, యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)ఎంపిక కావడం విశేషం. 2023–24, 2024–25 పోటీలు జరగలేదు. ఈ ఏడాది జరిగే ఇన్‌స్పైర్‌కు జిల్లా నుంచి జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు బాల శాస్త్రవేత్తలు సిద్ధపడుతున్నారు. ఇన్‌స్పైర్ మనాక్‌లో డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్‌ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులు తయారు చేయాలి.

జాతీయ స్థాయికి చేరేలా ప్రోత్సహించాలి ...



ఇన్‌స్పైర్ మనాక్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి భాగస్వామ్యం ఉండేలా చూస్తాం. సాధ్యమైనంత ఎక్కువ మంది ఇందులో పాల్గొని ప్రాజెక్టులు తయారు చేయాలని పాఠశాలల హెచ్‌ఎంలకు తెలియజేస్తున్నాం. ఈ మేరకు లక్ష్యాలను చేరుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలి.

– ఎస్.రాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి, పల్నాడు

కన్న కొడుకునే కడతేర్చాడు

- ముక్కలుగా నరికి, పూడ్చిపెట్టిన వైనం
- కుమారుడి అదృశ్యంపై మృతుడి పిన్ని ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన
- విచారణలో మరిన్ని విస్తుపోయే వాస్తవాలు
- 2014లో తల్లిని, తండ్రిని చంపిన దుర్మార్గుడు
- విషయం తెలిసి తీవ్ర కోపోద్రిక్తులైన క్రోసూరు మండలం యర్రబాలెం గ్రామస్తులు

జీవాల్లో వాటా అడిగినందుకు కొడుకును చంపిన తండ్రి



ఘటనాస్థలం వద్ద నిందితుడు వెంకటేశ్వర్లు నాయక్‌తో సీఐ పి.సురేష్



మీడియాతో మాట్లాడుతున్న మృతుడి తల్లి కోటేశ్వరీబాయి

క్రోసూరు: తాను సొంతంగా జీవించేందుకు, మేపు కొనేందుకు జీవాల్లో వాటా అడిగిన కుమారుడిని కన్న తండ్రే కడతేర్చిన హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామానికి చెందిన బూక్యా వెంకటేశ్వర్లు నాయక్, కుమారుడు మంగ్యానాయక్(19)లు జీవాలు మేపుతూ జీవనం సాగిస్తుంటారు. ఈక్రమంలో మూడు నెలల క్రితం క్రోసూరు మండలంలోని యర్రబాలెం గ్రామానికి జీవాలు మేపుకొంటూ వలస వచ్చారు. అయితే ఈనెల 3వ తేదీ నుంచి తమ కుమారుడు కనిపించడం లేదని నిందితుడి రెండో భార్య, మృతుడి పిన్ని ప్రమీలాభాయి ఈనెల 12వ తేదీన క్రోసూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా.. తన కుమారుడిని తానే చంపినట్లు వెంకటేశ్వర్లు నాయక్ అంగీకరించాడు. ఈనెల 3వ తేదీ రాత్రి జీవాల్లో వాటా అడిగినందుకు కొట్టి చంపి, ముక్కలు చేసి, పూడ్చిపెట్టినట్లు ఒప్పుకొన్నాడు. మృతదేహం పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులకు చూపించాడు.



మృతుడు మంగ్యానాయక్ (ఫైల్)

కోపోద్రిక్తులైన స్థానికులు

సీఐ పి.సురేష్, తహసీల్దార్ వీవీ నాగరాజు సమక్షంలో మంగ్యానాయక్ మృతదేహాన్ని పంచానామా చేసేందుకు వెలికి తీశారు. అన్నెంపున్నెం ఎరుగని కుమారుడిని చంపడంపై క్రోపోద్రిక్తులైన స్థానిక ప్రజలు, పుట్లగూడెం నుంచి వచ్చిన బంధువులు నిందితుడ్ని వదిలిపెట్టకూడదని తమకు అప్పగిస్తే తామే శిక్ష వేస్తామని నిందితుడిని పోలీసుల దగ్గరనుంచి లాక్కునే యత్నం చేశారు. ఈక్రమంలో పోలీసులు లాఠీచార్జి చేసి ప్రజల్ని తరిమివేసి నిందితుడిని పోలీసుస్టేషన్ తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

కన్న తల్లిదండ్రులను చంపిన కసాయి

విచారిస్తున్న క్రమంలో క్రోసూరు పోలీసులకు మరిన్ని విస్తుపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. వెంకటేశ్వర్లు నాయక్ క్రూర నేర చరిత్ర బయల్పడింది. 2014 సంవత్సరంలో తన సొంత తల్లిని అడవిలో నరికి చంపిన కేసులో ప్రస్తుతం బెయిల్ పై ఉన్నాడని తేలింది. అనంతరం తన తండ్రిని సైతం హతమార్చాడని, కొన్నాళ్లు జైలు జీవితం గడిపాడని.. తన 3 నెలల కుమారుడిని సైతం చంపివేసిన కేసులో కూడా ఉన్నప్పటికీ సాక్ష్యాలు బలంగా లేని కారణంగా ఆ కేసు నిలవలేదని నిందితుడి మొదటిభార్య, మృతుడి తల్లి కోటేశ్వరీభాయి, గ్రామస్తులు సంఘటనా స్థలంలో మీడియాకు వివరించారు. అచ్చంపేట సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ రవిబాబు కేసును విచారిస్తున్నారు.

బుల్లెట్ బైక్ దొంగల అరెస్ట్

- అందరూ బీటెక్ విద్యార్థులే..
- 16 బుల్లెట్‌లు, స్కూటర్, రూ.25.20 లక్షలను స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ బైకులు

అద్దంకి రూరల్: యూ ట్యూబ్ మంచే కాదు చెడు చేస్తుందనడానికి బీటెక్ విద్యార్థులు దొంగలుగా మారిన ఘటనే ఉదాహరణ. చెడు వ్యసనాలకు బానిసలై, సులువుగా డబ్బు సంపాదించాలని ఆశ వారిని కటకటాల పాల్జేసింది. ఒంగోలులో బీటెక్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఒక ముఠాగా ఏర్పడి ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో బుల్లెట్ బైక్‌లను దొంగిలించారు. అద్దంకి సీఐ బృందం కేసును ఛేదించి దొంగలను పట్టుకున్నారు. చీరాల డీఎస్పీ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అద్దంకికి చెందిన పల్లా సాయిరాం, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన నార్లగడ్డ గోవిందరాజు, నెల్లూరు జిల్లా కావలి మండలం చౌదరిపాలెం గ్రామానికి చెందిన కోడెల పవన్‌కుమార్, ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం యోడ్లూరిపాడు గ్రామానికి చెందిన దివీ వేణుగోపాల్, దర్శి మండలం ఈస్ట్ వీరాయపాలెంకు చెందిన రాయపూడి వసంత్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కొత్త పెండ్యాల గ్రామానికి చెందిన జీనెపల్లి నరేంద్రవర్మ, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం, ఆలూరి గ్రామానికి చెందిన అక్కుల వెంకట సాయిరెడ్డిలు ఒంగోలులోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. చెడు వ్యవసనాలకు బానిసైన వీరు సులువుగా డబ్బు సంపాదించే మార్గం చెప్పాలని నిందితుడు గోవిందరాజును సలహా అడిగారు. యూట్యూబ్‌లో సెర్చ్‌చేసి బుల్లెట్ బండ్లు దొంగతనం చేసే విధానాన్ని అందరికీ చూపించాడు. అప్పటి నుంచి బుల్లెట్ బండ్లను దొంగలించటం ప్రారంభించారు.

శింగరకొండ తిరునాళ్లలో మొదటి దొంగతనం

మొదటగా అద్దంకి మండలం శింగరకొండ తిరునాళ్ల రోజు 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బుల్లెట్ బండిని దొంగిలించారు. నామ్ హైవేపై పెట్టిన బండ్లను, అద్దంకి పట్టణంలోని చినగానుగపాలెం, కాకానిపాలెం, దామావారిపాలెం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, సింగరకొండ గుడి వద్ద కలిపి అద్దంకి స్టేషన్ పరిధిలో 9 బుల్లెట్ బైక్‌లను తస్కరించారు. జె.పంగులూరు పరిధిలో బుల్లెట్, స్కూటీ, చిలకలూరిపేట స్టేషన్ పరిధిలో మూడు బుల్లెట్‌లు, నరసరావుపేట పరిధిలో ఒక బుల్లెట్, మద్దిపాడు, మేదరమెట్లల్లో ఒక్కొక్కటి మొత్తం 16 బుల్లెట్‌లు, ఒక స్కూటీ దొంగిలించారు. వారినుంచి 16 బుల్లెట్లు, స్కూటీ, రూ.25.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

పెన్షనర్ల ర్యాలీ, ధర్నా



నరసరావుపేట ఈస్ట్: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపులో భాగంగా మంగళవారం అసోసియేషన్ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గాంధీపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.రామకృష్ణారావు మాట్లాడుతూ కేంద్రం ఆర్థిక బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ సవరణను రద్దు చేయాలని కోరారు. కేంద్రం 8వ పే కమిషన్, రాష్ట్రం 12వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కె ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వి.చలపతిరావు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,700

మోడల్ ధర రూ. 1,400



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 934

కొమ్ములు : 812 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,400	10,775	10,400

కాయలు : 122 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,400	10,775	10,350

మొత్తం అమ్మకాలు : 700.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	53,761
అమ్మకాలు	52,228
నిల్వ	7,478

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,300
341	10,000–13,400
సూపర్–10	10,000–13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,600
నంబరు–5	10,000–13,500
341	10,000–13,500
4884	10,000–12,500
సూపర్–10	10,000–13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,600
బాడిగ–355	10,000 – 12,300
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 10,800
తాలుకాయలు	5,000 – 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,500
బాడిగ – 355	10,000–12,600
దేవనూరు డీలక్స్	10,000–12,500
తాలు	5,200 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

అవినీతి మయం నాణ్యత దూరం

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షల్లో భారీ అక్రమాలు

- విద్యాశాఖ మంత్రి నివాసానికి కూతవేటు దూరంలో విద్యావ్యాపారం
- పచ్చచొక్కాల ఆధ్వర్యంలో పైసల చాటున పరీక్షలు
- పరీక్షల పేరిట స్టడీ సెంటర్ల దందా
- ప్రతి దానికి ఒక రేటు..
- ఏఎన్‌యూ పరిధిలో 'పచ్చ'గా పరీక్షల వ్యాపారం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా పరీక్షలు అక్రమాలకు నిలయంగా మారాయి. విద్యాశాఖ మంత్రి నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న విశ్వవిద్యాలయంలో దూర విద్య పరీక్షల పేరిట రూ.కోట్ల విద్యా వ్యాపారం జరుగుతుంటే అడ్డుకునేవారే లేకుండా పోయారు. ఈనెల 10 నుంచి ప్రారంభమైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా యూజీ, పీజీ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్నాయి. దాదాపు 72 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పచ్చచొక్కాల నాయకుల మంటూ పరీక్షల్లో రూ.కోట్ల అక్రమ వ్యాపారానికి తెరలేపారు. జిల్లాలోని ఒక ఎంపీ బంధువునంటూ ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి.. ఒక శాసనసభ్యుడికి అత్యంత సన్నిహితుడిని అంటూ ఒక అధికారి.. టీడీపీ నేతలమంటూ ఇద్దరు నాన్‌టీచింగ్ ఉద్యోగులు, ఒక అతిథి అధ్యాపకుడు ఈ విద్యా వ్యాపారంలో కీలక వ్యక్తులుగా మారారు.

వీరి రూటే సెప'రేటు'

స్టడీ సెంటర్స్ ద్వారా ఏఎన్‌యూ అధికారులు రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. దూర విద్యలో ప్రతి దానికి ఒక రేటు చొప్పున దండుకుంటున్నారు. పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (పీసీపీ) కింద ఇటీవల రూ.4కోట్ల వరకూ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ మొత్తంలో 20 శాతం కమీషన్లు ఒక ఉద్యోగి ఆధ్వర్యంలో వసూలు చేశారు. గతంలో పలు మార్లు సస్పెండ్ అయిన సదరు అవినీతి ఉద్యోగి రూ.80 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు స్టడీ సెంటర్స్ నుంచి సేకరించినట్లు యూనివర్సిటీ సిబ్బంది చెబుతున్నారు. ఆలస్యంగా ఫీజు చెల్లించే విద్యార్థులకు కేటాయించే బఫర్‌లకు కూడా రేట్లు పెట్టి వసూలు చేస్తున్నారు. కొన్ని సెంటర్స్‌కు బఫర్ బుక్‌లెట్‌ను ఒక్కోటి రూ.100 నుంచి రూ. 200 చొప్పున పదివేలకు పైగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు.

మా ప్రభుత్వం.. మా ఇష్టం

వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తాము అధికార టీడీపీ నేతలమంటూ.. మా ప్రభుత్వంలో మా ఇష్టం అంటూ దూర విద్య పరీక్షలను రూ.కోట్ల ఆదాయాన్ని ఇచ్చే వ్యాపారంగా మార్చారు. జిల్లాలోని ఒక కీలక శాసనసభ్యుడి అనుచరుడినంటూ దూర విద్యలో ఒక కీలక పదవి దక్కించుకున్న ఓ అధికారి ఈ అక్రమ వసూళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వంలో పరీక్షల విధులు నిర్వహించిన ఈయన అనేక ఆరోపణలు ఎదుర్కొన్నాడు. గతంలో వర్సిటీ దస్త్రాలు తస్కరించాడనే ఆరోపణలతో పోలీసు విచారణ ఎదుర్కొన్న ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి దూర విద్య అక్రమాల్లో కీలక పాత్రధారి అని వర్సిటీలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్క జిల్లాలోని ఒక ఎంపీ బంధువునంటూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెత్తనం మొదలు పెట్టిన అధికారి దూరవిద్యా పరీక్షలను శాసించే స్థాయికి ఎదిగాడు.

మంత్రి గారు... పట్టించుకోరూ..!

విద్యాశాఖ మంత్రి ఇంటి సమీపంలోని వర్సిటీలో కోట్లాది రూపాయల అక్రమాలు జరుగుతున్నా.. సదరు అమాత్యులు కనీసం దృష్టి సారించడం లేదు. వర్సిటీలో ఒక వైపు విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నా.. దూర విద్యకేంద్రాల్లో జరుగుతున్న కలెక్షన్ల గురించి వారు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఒక్కో దానికి ఒక్కో రేటు

ఇంటి దగ్గర పరీక్ష రాస్తే ఒక రేటు.. పుస్తకం చూచి రాస్తే మరో రేటు.. విద్యార్థి బదులు మరొక వ్యక్తి పరీక్ష రాస్తే రెట్టింపు రేటు అంటూ రాష్ట్రవ్యాప్తంగా అనేక స్టడీ సెంటర్లు ఒక్కో రేటు చొప్పున నిర్ణయించి వసూలు చేస్తున్నాయి. పుస్తకాలతో చూచిరాస్తే ఒక్కో పరీక్షకు రూ. 500 నుంచి రూ. 1500 వరకు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి బదులు మరొకరు పరీక్ష రాస్తే రూ. 1500 – రూ. 2 వేలు దండుకుంటున్నారు. కొన్ని స్టడీ సెంటర్లలో ఇంటి దగ్గర పరీక్ష రాసే అవకాశం కల్పించి ఒక్కో పేపర్‌కు రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ కాపీయింగ్ రేట్లను వర్సిటీలోని కొందరు సిబ్బందే నిర్ణయించడం కూటమి అవినీతి పాలనకు నిదర్శనంగా నిలిచింది.

తూతూమంత్రంగా పరిశీలన

నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా పరీక్ష విధులు నిర్వహించేవారిని పరిశీలకులుగా నియమించాల్సిన వర్సిటీ అధికారులు పచ్చ చొక్కాల పైరవీలతో వారి అనుకూలమైన వారిని నియమిస్తున్నారు. గత ఏడాది భారీగా డబ్బులు వసూలు చేశారనే ఫిర్యాదులు వచ్చిన వారిని ఈ ఏడాది కూడా పరిశీలకులుగా నియమించారు. వర్సిటీలో పనిచేసే నాన్ టీచింగ్ సిబ్బంది బంధువులకు, విద్యార్థి సంఘాల నాయకులకు, టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వారికి అనుబంధ కళాశాలల లెక్చరర్లు అంటూ విధులను కేటాయించారు.

23,24 తేదీల్లో భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దండా లక్ష్మీనారాయణ, సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు

లక్ష్మీపురం: ఈనెల 23, 24 తేదీల్లో పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేటలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత ఏడు సంవత్సరాలుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పనిచేయకపోవడం వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని చర్చించి భవిష్యత్ ప్రణాళికను ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వారిని అవమానించడమేనన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల కార్యదర్శులు దీవెనరావు, ఎస్.కె.ఖాసీం వలి, దూదేకుల మస్తాన్ వలి, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు సీతారామయ్య, బోయపాటి అక్కారావు, నికల్సన్, విమల్, తదితరులు పాల్గొన్నారు.

23 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



గుంటూరు వెస్ట్: గృహావసరాలకు వాడుకోవాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపారం కోసం వాడుకుంటున్నారన్న వచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించి 23 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని కళ్యాణి టిఫిన్స్, వినాయక టిఫిన్స్, సత్య నాగా టిఫిన్స్ నుంచి ఈ సిలిండర్లు స్వాధీనం చేసుకుని 6ఏ కేసులు నమోదు చేశామని సివిల్ సప్లయిస్ డీటీ బేగ్ తెలిపారు.

22న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న బ్రాడీపేట 3వ లైనులోని మాస్టర్‌మైండ్స్ క్యాంపస్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈనెల 22న ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో 679 ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. వివరాలకు తమ ప్రతినిధులు వెంకట్ అల్లూరి (89195 08017), షేక్ ఎం డీ రఫీ (88860 65546), ఎ.రామకృష్ణారెడ్డి (77319 82861) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగంలో నియామకాలు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురిని పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం కమిటీలో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎస్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా సత్తెనపల్లికి చెందిన చిలకల జయపాల్, పెదకూరపాడుకు చెందిన చిలకల పెదబాబును నియమించారు.

కార్మికుల న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయబద్ధమైన కోరికలను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో గత రెండు రోజుల నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళవారం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఇదిసరైన పద్ధతి కాదన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదని, కార్మికుల కుటుంబాలను పస్తుల నుంచి కాపాడుకోవడానికి ఈ సమ్మె చేస్తున్నారన్నారు. జీఓ నెంబర్ 36 ప్రకారం వారి జీతాలు పెంచాలని, కార్మికులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆయన డిమాండ్‌చేశారు. అంతేకాకుండా త్వరలోనే మున్సిపల్ కార్మికులు కూడా సమ్మె బాట పట్టబోతున్నారని, వారు సమ్మె చేస్తే రాష్ట్రంలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండే పరిస్థితి ఉంటుందని కావున ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు వాసుదేవరెడ్డి, పార్టీ గురజాల మున్సిపాలిటీ కన్వీనర్ జూలకంటి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు సయ్యద్ జబీర్, సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ఆర్మీ అండగా ఉంటుంది

- జేసీఓ ఎం.వెంకటరెడ్డి
- కార్గిల్ అమరవీరుడు హాజీ బాషా చిత్రపటానికి ఘన నివాళి



హాజీ బాషా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీఓ వెంకటరెడ్డి, సైనికులు, మాజీ సైనికులు

చందోలు(కర్లపాలెం): కార్గిల్ అమరవీరుడు మహ్మద్ హాజీ బాషా త్యాగాన్ని భారతీయులు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని, అమరవీరుల కుటుంబాలకు ఆర్మీ అండగా ఉంటుందని ఎనిమిదో మౌంటెన్ విజన్ హెడ్ క్వార్టర్ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో) ఎం వెంకటరెడ్డి చెప్పారు. 1999వ సంవత్సరంలో ఆపరేషన్ విజయ్‌లో భాగంగా కార్గిల్‌లో జరిగిన యుద్ధంలో జరిగిన బాంబు బ్లాస్టింగ్‌లో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన జవాన్ మహమ్మద్ హాజీ బాషా అమరుడయ్యారు. 26వ కార్గిగల్ దివస్ సందర్భంగా మంగళవారం 8వ మౌంటెన్ డివిజన్ హెడ్‌క్వార్టర్ జవాన్లు చందోలు గ్రామానికి వచ్చి మాజీ సైనికులతో కలసి కార్గిల్ అమరవీరుడు, సేనా మెడల్ అవార్డు గ్రహీత హాజీబాషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాజీ బాషా కుటుంబ సభ్యులకు కార్గిల్ దివస్ మెమొంటో, ప్రశంసాపత్రం అందజేశారు. హాజీ బాషా పోరాట పటిమను, త్యాగనిరతిని స్థానిక విద్యార్థులకు, గ్రామస్తులకు సైనికులు వివరించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ కార్గిల్ వీరుని గుర్తుగా చందోలు గ్రామానికి మహ్మద్ హాజీ బాషా పేరుతో ముఖమండపం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో 8వ మౌంటెన్ డివిజన్ హవల్దార్ రాజేష్, చిరంజీవులు, మాజీ సైనికుల అసోసియేషన్ చందోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం బాపట్ల అధ్యక్షులు దావూద్, సస్త్రక్ సుల్తాన్, టి.సుబ్బారావు, పి.ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

బాపట్ల: మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. ప్రభుత్వం నుంచి స్పందన కనిపించకపోవడంతో కార్మికులు పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించేది లేదని సీఐటీయూ నాయకులు మజుందార్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాత్కాలికంగా ప్రైవేటు వర్కర్లతో పనులు చేయించుకున్నప్పటికీ అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు సమ్మెబాట వీడేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు రత్నం, నాని, అశోక్, పట్టణ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ నాయకులు మురళీకృష్ణ, హరిబాబు, సామిరెడ్డి, ప్రమీల, నరేష్ పాల్గొన్నారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్

తాడికొండ: ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం సౌజన్యంతో తుళ్ళూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ డ్రైవ్‌లో రోజుకు 35 – 70 మందికి పాసుపోర్టు జారీ చేస్తామన్నారు. ఇందుకోసం అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూలై 22–23 తేదీలలో స్లాట్ దొరకని వారు ఇతర తేదీలను ఎంచుకోవచ్చని, అధికారులు వాటిని డ్రైవ్ జరిగే తేదీలకు సర్దుబాటు చేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు నిర్ణీత ధ్రువపత్రాలతో జూలై 16–17 తేదీలలో తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో సైతం దరఖాస్తు చేసుకొనేందుకు సంప్రదించవచ్చన్నారు. రూ.1500 చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం జనరేట్ అయిన ఏఆర్ఎన్ నంబరును సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ శంకర్‌కు అందజేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సీఆర్డీఏ ఫెసిలిటేటర్, లేదా సీహెచ్ శంకర్ 9848424207కు కాల్ చేయాలని తెలిపారు. సాధారణ పాస్‌పోర్టు (మొదటి సారి) కోసం దరఖాస్తు చేసేందుకు అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రంతో పాటు బర్త్ సర్టిఫికెట్, 10వ తరగతి సర్టిఫికెట్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, టీసీలలో ఏదైనా ఒకటి, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఓటర్ ఐడీ మూడింటిలో ఒకటి జతచేయాలన్నారు. పాత పాస్‌పోర్టు గడువు ముగిసినా లేదా రెన్యూవల్, పోయిన పాస్‌పోర్టులకు సంబంధించిన సేవలు ఈ డ్రైవ్‌లో లభ్యం కావన్నారు. పాస్‌పోర్టు సేవల రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ కోసం అమరావతి ప్రాంత వాసులు తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

డీఈఓ కార్యాలయం వద్ద ఎంటీఎస్ టీచర్ల ఆందోళన

పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో సర్దుబాటు వద్దంటూ నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల్లో మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిపై పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లాలోని దుర్గి, వెల్దుర్తి, బొల్లాపల్లి తదితర మండలాల్లో రెగ్యులర్ టీచర్ల బదిలీ కారణంగా ఖాళీగా ఉన్న పాఠశాలల్లో ఎంటీఎస్ పద్ధతిపై పనిచేస్తున్న టీచర్లను సర్దుబాటు చేసేందుకు మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయానికి రావాల్సిందిగా సమాచారం పంపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 150 మంది ఎంటీఎస్ టీచర్లకు సమాచారం పంపడంతో సంబంధిత టీచర్లు డీఈఓ కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గతనెలలోనే తమను కౌన్సెలింగ్ ద్వారా వేర్వేరు పాఠశాలలకు పంపారని, మళ్లీ ఇప్పుడు కౌన్సిలింగ్ పేరుతో పల్నాడు జిల్లాలోని మారు మూల మండలాలకు వెళ్లాలని చెప్పడం ఏంటంటూ ఆందోళనకు దిగారు. కాగా, గుంటూరు, పల్నాడు జిల్లాల డీఈఓలు పి.వి.రేణుక, చంద్రకళ ఎంటీఎస్ టీచర్లతో మాట్లాడారు. డీఎస్సీ నియామకాలు జరిగి కొత్త టీచర్లు వచ్చే వరకు పల్నాడు జిల్లాలో విధులు నిర్వహించాలంటూ ఎంటీఎస్ టీచర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఎంటీఎస్ టీచర్ల అంగీకరించలేదు. ఫలితంగా కౌన్సెలింగ్ నిలిచిపోయింది.

లక్ష్యానికి మించి ఉపాధి పనులు

డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ మూర్తి



యడ్లపాడు: జిల్లాలో ఉపాధి హామీ పనులు లక్ష్యానికి మించి జరుగుతున్నాయని జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ మూర్తి వెల్లడించారు. మంగళవారం యడ్లపాడు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, ఉపాధి హామీ పథకం పనులు ప్రగతి, లక్ష్యాలు, ఇతర విషయాలను అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఉపాధి పనుల లక్ష్యం 45 లక్షల పనిదినాలు కాగా, ఇప్పటికే 55.13 లక్షల పని దినాలు పూర్తయ్యాయని, ఇది లక్ష్యానికి మించి సాధించిన ప్రగతి అని వివరించారు. గోకుల షెడ్ల పథకానికి సంబంధించి గత ఏడాది మంజూరైన 740 గోకుల షెడ్లలో 63 షెడ్లు బేస్ లెవల్‌లో ఉన్నాయని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకం కింద 100శాతం రాయితీని అందిస్తున్నామని ఎంఎస్ మూర్తి తెలిపారు.

జీడీసీఏ జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ చౌదరి



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(జీడీసీఏ) నూతన అధ్యక్షుడిగా చుక్కపల్లి రాకేష్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జీడీసీఏ ఉపాధ్యక్షుడు తోట వెంకట శివ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించిన ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా వెంకటరత్నం వ్యవహరించారన్నారు. కార్యదర్శిగా ఎనుముల శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కొంగర రాహుల్ చౌదరి, ఉపాధ్యక్షుడిగా తోట వెంకట శివరామకృష్ణ, కోశాధికారిగా సింగరాజు లక్ష్మీకాంత్, కౌన్సిలర్‌గా నందిరాజు శివ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.

20న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్స్, సీనియర్స్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు ఇ.శివ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొనే చిన్నారులు జనవరి 2, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీలకు హాజరయ్యే వారు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 83477 85888 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.